
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

సోమవారం 24 నవంబరు 2025 | 5



సముద్రంలో బాలుడి గల్లంతు 6

అయినవిల్లి సిద్ధివినాయక ఆలయంలో చీఫ్ సెక్రటరీ పూజలు 6

వాగులో మునిగిన జిమ్ ట్రైనర్ మృతి 6

సత్యసాయి సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకోవాలి: కలెక్టర్

» కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో బాబా శతజయంతి వేడుకలు

అమలాపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ మహేష్ అన్నారు. అమలాపురంలోని మహిపాలవీధిలోని సత్యసాయి సేవా మందిరంలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతిలోభాగంగా బాబా చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాబా సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాల ద్వారా ప్రేరణ పొందాలన్నారు. డీఆర్వో మాధవి, ఏవో కాశీవిశ్వేశ్వరరావు, దివాకర్ సత్యసాయిబాబా సేవా మందిరం కన్వీనర్ ఎస్.సుబ్బారావు పాల్గొన్నారు. కలెక్టర్‌ను సత్యసాయిబాబా సేవాసమితి తరపున శాలువా కప్పి మెమెంటో అందించి సత్కరించారు.

మానవాళికి శాంతి మార్గదర్శకం సాయి: జేసీ

సత్యం.. ధర్మం.. శాంతి.. ప్రేమ.. అహింస అనే ఐదు మూల సూత్రాలను ప్రపంచానికి బోధించిన మహానుభావుడు భగవాన్ సత్యసాయిబాబా అని జేసీ టి.నిషాంతి అన్నారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఉత్సవాల్లో డీఆర్వో కె.మాధవి, ఏవో కాశీవిశ్వేశ్వరరావు, రమణకుమారి పాల్గొన్నారు.

సేవారంగంలోను ఆదర్శనీయం: ఎస్పీ

ఆధ్యాత్మిక గురువు సత్యసాయిబాబా వందో జయంతి ఉత్సవాలను ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ రాహుల్‌మీనా మాట్లాడుతూ సత్యసాయిబాబా కేవలం ఆధ్యాత్మికవేత్తగానే కాకుండా విద్యా, వైద్యం, తాగునీటి సరఫరా వంటి అనేక రంగాల్లో విశేష సేవలందించిన మహోన్నతుడు అని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఏవీఆర్‌బీ ప్రసాద్, ఎస్పీ సీఐ పుల్లారావు, ఏఆర్ఆర్ఐ బ్రహ్మానందం, దిలీప్ పాల్గొన్నారు.







సత్యసాయి సేవామందిరం, కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో సత్యసాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి, ఎస్పీ రాహుల్ మీనా

బాబోయ్.. బాదుడు



» సంక్రాంతి పండుగకు ఊరొచ్చే దారేది

» అప్పుడే బస్సులు, రైళ్లు, విమాన చార్జీల దోపిడీ

» జనవరి 10 నుంచి వీటన్నింటిలో టికెట్ ధరలు మూడింతలపైనే

» హైదరాబాద్ టు రాజమహేంద్రవరం ఏకంగా రూ.16 వేలు దాటేసిన ఇండిగో చార్జి

» బెంగళూరు నుంచి రూ.14వేలపైనే

» హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ వైపు వచ్చే రైళ్లన్నీ రిగ్రెట్

» అటు ప్రైవేటు ట్రావెల్ బస్సుల ఏసీ స్లీపర్ చార్జీలు తడిసిమోపెడు

» హైదరాబాద్ నుంచి వచ్చే ఆర్టీసీ ఏసీ, సూపర్ లగ్జరీ బస్సుల్లో జనవరి 9 నుంచే సీట్లు సున్నా

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండగకు అప్పుడే చార్జీలు షాక్ కొడుతున్నాయి. స్వగ్రామాలకు రావాలంటేనే టికెట్ ధరలు గూబగుయ్‌మనిపిస్తున్నాయి. బస్సులు.. విమానాలు.. రైలు చార్జీలు మూడింతలు పెరిగిపోయాయి. టికెట్ కొందామన్నా ఏకంగా దొరకని పరిస్థితికి చేరిపోయాయి. వచ్చే ఏడాది జనవరి 14న బుధవారం సంక్రాంతి పండుగ. దీంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు కూడా ముందుగానే జనవరి 10 నుంచి సెలవులు ప్రకటించాయి. దీంతో అప్పటి నుంచి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి పనులపై ఎక్కడెక్కడో ఉంటున్న వారంతా పండుగకోసం ఉమ్మడి జిల్లాలో వారి స్వగ్రామాలకు చేరుకుంటారు. ప్రధానంగా సంక్రాంతికి ఉమ్మడి జిల్లాకు చెందిన వారు హైదరాబాద్ నుంచి ఎక్కువగా వస్తుంటారు. అక్కడ వ్యాపారాలు, ఉద్యోగాలు, సినిమా రంగంలో ఉన్నవారు, పండగ ఆనందాలకు బంధువుల రూపంలో కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ ప్రాంతాలకు వస్తారు. అయితే ఇప్పటి నుంచే చార్జీలు ఆకాశాన్నంటేశాయి. సాధారణంగా సంక్రాంతి పండగకు వచ్చే వారికి ఎప్పుడో డిసెంబరు రెండో వారం నుంచి చార్జీలు పెరుగుతుంటాయి. కానీ ఈసారి పండుగకు ఏకంగా నవంబరుకే అన్నీ మూడింతలు పెరిగిపోయాయి. హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లా వైపు వచ్చే రైళ్లన్నీ నిండిపోయి ఇప్పటికే రిగ్రెట్ చూపిస్తుండడం విశేషం.

బాబోయ్ ఎగరలేం..

పండగ అంటే సంక్రాంతి. ఈ పండుగకు ఎవరు ఎక్కడ ఉన్నా ముందుగానే రెక్కలు కట్టుకుని సొంతూర్లకు రావలసిందే. బంధుమిత్రులతో సరదాగా గడపాల్సిందే. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో సంక్రాంతి సందడే వేరు. భోగిమంటలు, కోడి పందేలు, గుండాట, జాతర్లతో ఏ ఊరు చూసినా సందడిగా మారుతుంది. ఉమ్మడి జిల్లాకు చెందినవారు ఎక్కువమంది సినిమా రంగం, ఐటీ, వ్యాపారరంగాలు, ఉద్యోగాల పేరుతో హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. వారంతా పిల్లాపాపలతో సొంతూర్లకు చేరుతారు. అయితే పండుగకు ఇంకా యాభై రోజులు ఉండగానే చార్జీలు మాత్రం అప్పుడే షాక్ కొట్టేస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి సాధారణ రోజుల్లో ఇండిగో టికెట్ చార్జీ రూ.4,271 వరకు ఉంటోంది. కానీ జనవరి 10 నుంచి మాత్రం చూస్తే గుండె గుబేల్‌మంటోంది. ఏకంగా ఈ రూట్లో అప్పుడే టికెట్ చార్జీ గరిష్ఠంగా రూ.16,241కి చేరిపోయింది. ఈ మార్గంలో హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి రోజూ ఇండిగో నాన్‌స్టాప్, సింగిల్‌స్టాప్ కేటగిరీలో ఎనిమిది సర్వీసులు నడుపుతోంది. కానీ సంక్రాంతి రద్దీ నేపథ్యంలో ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అప్పుడే ధరలను భారీగా పెంచేసింది. పండుగకు ఎక్కువ మంది కాస్త ధర ఎక్కువైనా వేగంగా వచ్చేందుకు విమానాలనే ఎంచుకుంటున్నారు. దీంతో జనవరి నుంచి భోగి పండుగ రోజు వరకు చార్జీలను దారుణంగా పిండేస్తోంది. తీరా సంక్రాంతి పండుగ రోజురూ.5,800 మాత్రమే వసూలు చేస్తోంది. అటు బెంగళూరులో పనిచేస్తోన్న ఉమ్మడి జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పండుగకు ముందే వస్తారు. వీరిని కూడా జనవరి 10వ తేదీ నుంచి రూ.14 వేల వరకు పిండేస్తోంది. సాధారణ రోజుల్లో ఈ రూట్లో చార్జీ రూ.4,763కాగా, పండగ సాకుతో మూడింతలపైనే వసూలు చేస్తోంది.

రైళ్లన్నీ రిగ్రెట్...

హైదరాబాద్ నుంచి సంక్రాంతి పండగకు ఉమ్మడి జిల్లాలో రాజమహేంద్రవరం, సామర్లకోట, కడియం, అన్నవరం, తుని, కోనసీమ ప్రాంతాలకు వచ్చే వారంతా ఎక్కువగా రైళ్లపై ఆధారపడతారు. తీరా ఇవి కూడా వెయిటింగ్ లిస్ట్ కూడా నిండిపోయి ఏకంగా రిగ్రేట్ చూపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో ఈ రూట్లో రైళ్లకు రద్దీ ఎప్పుడూ ఉంటుంది. తీరా సంక్రాంతి పండుగకు అయితే అంతకుమించి అన్నట్టు మారిపోయింది. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లా మీదుగా నిత్యం 17 రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే పండగ నేపథ్యంలో జనవరి 10 నుంచి ఇవన్నీ నిండిపోయాయి. ఎప్పుడూ ఎన్నోకొన్ని సీట్లు ఖాళీగా ఉండే వందే భారత్ రైళ్లలో కూడా జనవరి 10 నుంచి 13వ తేదీ వరకు రిగ్రెట్ చూపిస్తోంది. అంటే వెయిటింగ్ లిస్ట్ టిక్కెట్లు కూడా అయిపోయి టికెట్ కూడా ఇవ్వని పరిస్థితికి చేరింది. అలాగే గరీబ్ రథ్ జనవరి 12వరకు రిగ్రెట్ చూపిస్తోంది. విశాఖ ఏసీ ఎక్స్‌ప్రెస్, ఫలక్‌నుమా, గౌతమీ ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ 13వ తేదీ వరకు రిగ్రెట్ కనిపిస్తోంది. చర్లపల్లి, సాయినగర్ షిర్డీ, ఈస్ట్‌కోస్ట్, కోణార్క్, విశాఖ ఎల్‌టీటీ సైతం అదే పరిస్థితి. చివరకు హైదరాబాద్ నుంచి వచ్చే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు కూడా 13 వరకు సీట్లన్నీ రిగ్రెట్‌లోకి వెళ్లాయి.

ట్రావెల్స్ ఉతుకుడు..

ప్రైవేటు ట్రావెల్స్ విషయానికొస్తే హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ, రావులపాలెం వైపు వచ్చేవన్నీ అప్పుడే చార్జీలు మూడింతలు పెంచేశాయి. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ వైపు ఏసీ స్లీపర్ బస్సు చార్జీలు రూ.1079 నుంచి రూ.1419 వరకు ఉన్నాయి. కానీ సంక్రాంతి దోపిడీలో భాగంగా జనవరి 10 నుంచి ఏకంగా ఆయా ట్రావెల్స్ ఆధారంగా రూ.4150 నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే సగానికిపైగా సీట్లు ఫుల్ అయినట్టు చూపుతున్నాయి. పండుగ దగ్గరయ్యే కొద్దీ ఈ రేట్లు మరింత పెంచడానికి సిద్ధమవుతున్నాయి. ఇక హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి ఆర్టీసీ రోజుకు 15 ఏసీ, నాన్‌ఏసీ సూపర్‌లగ్జరీ బస్సులు నడుపుతుం డగా, జనవరి 9 నుంచి 12 వరకు మూడు రోజుల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా లేదు. మొత్తం అన్నీ బుక్ అయిపోవడంతో సోల్డ్‌అవుట్ కనిపిస్తోంది. కాకినాడకు హైదరాబాద్ నుంచి రోజూ ఆరు సర్వీసులు నడుస్తుండగా జనవరి 9 నుంచే ఫుల్ అయిపోయాయి

మిషన్ వాత్సల్యతో అనాథలకు భరోసా



» జిల్లాలో 350మంది గుర్తింపు

» ఒక్కొక్కరికీ నెలకు రూ.4వేల చొప్పున ఆర్థికసాయం

అమలాపురం రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అనాథలతోపాటు దైన్యస్థితిలో ఉన్న విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తోంది. అత్యంత దీనావస్థలో విద్యాభ్యాసం సాగిస్తున్న 18ఏళ్లలోపు విద్యార్థులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాత్సల్యం చూపిస్తున్నాయి. కేంద్ర మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రాయోజిత పథకం కింద మిషన్ వాత్సల్యను ప్రారంభించారు. చిన్నారులకు ఆరోగ్యకరమైన సంతోషకరమైన బాల్యాన్ని అందించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అర్హులైన వారిని ఎంపిక చేసి ఒక్కొక్కరికీ నెలకు రూ.4వేల చొప్పున ఏడాదికి రూ.48వేలు ఆర్థికసాయం అందిస్తారు.

అనాథలకు తొలి ప్రాధాన్యం

మిషన్ వాత్సల్య పథకంలో తల్లీ,తండ్రి లేని అనాథలకు తొలి ప్రాధాన్యమిస్తారు. ఆ తర్వాత వరుసగా కొవిడ్ సమయంలో తల్లిని గానీ, తండ్రిని గానీ కోల్పోయినవారు అర్హులు. దీర్ఘకాలిక వ్యాధుల బారినపడి తల్లిదండ్రులు మరణించిన కుటుంబాల్లోని పిల్లలు, హెచ్‌ఐవీ బారిన పడిన కుటుంబాల్లోని పిల్లలకు ఈ పథకాన్ని ప్రాధాన్యక్రమంలో వర్తింపచేస్తారు. మృతిచెందిన తల్లిదండ్రుల డెత్ సర్టిఫికెట్లతోపాటు విధిగా వారి అనారోగ్య సమస్యలకు సంబంధించిన కచ్చితమైన రిపోర్టులను అందించాల్సి ఉంటుంది. పదేళ్లలోపు చిన్నారులైతే వారికి సంరక్షకుడిగా ఉన్న వారి బ్యాంకు ఖాతాకు నగదు జమ చేస్తారు. పదేళ్ల పైబడిన విద్యార్థులకు నేరుగా ఆ విద్యార్థి బ్యాంకు ఖాతాకే నగదును జమ చేస్తారు. ఈ పథకం పొందాలంటే తల్లీ, తండ్రి, సంరక్షకుల వార్షికాదాయం పట్టణాల్లో రూ.96వేలు,గ్రామీణప్రాంతాల్లో రూ.72వేలకు మించరాదు.

350మందికి మిషన్ వాత్సల్య

మిషన్ వాత్సల్య పథకం కింద జిల్లాలో 350మంది చిన్నారులను గుర్తించాం. 18ఏళ్ల లోపు చిన్నారులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులనే ఎంపిక చేయాలి. ప్రభుత్వ వసతిగృహాలతోపాటు ఇతర శరణాలయాల్లో ఉంటున్నవారికి ఈ పథకం వర్తించదు. ఈ పథకం కింద దరఖాస్తులను ఆయా ప్రాంతాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం టీచర్ ద్వారా జిల్లా కార్యాలయానికి పంపించాలి. సదరు విద్యార్థి విధిగా స్టడీ సర్టిఫికెట్‌తోపాటు ఆధార్, ఇతర డాక్యుమెంట్లను సమర్పించాలి. ఈ పథకం కింద ఎంపికైన వారికి రెండేళ్లపాటు నెలకు రూ.4వేలు ఆర్థికసాయం అందిస్తారు. 18ఏళ్లు నిండితే వారి స్థానంలో అర్హులను తీసుకుంటాం.

-బి.ఉమాలక్ష్మి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్

రేపు మంత్రి నాదెండ్ల మనోహర్ రాక

మండపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) పౌరసరఫరాలశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 25న మండపేట రానున్నారని ఏపీఐడీసీ రాష్ట్ర చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున మండపేట పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న సూర్యకన్వెన్షన్ హాలులో నియోజకవర్గ రైతులతో జరిగే ముఖాముఖి సమావేశంలో మంత్రి నాదెండ్లతోపాటు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొంటారని ఆయన చెప్పారు. మంత్రి పర్యటనను కూటమి నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

జిల్లాలో కొత్తగా..

108 పోలింగ్ కేంద్రాల ప్రతిపాదన

» రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షలో జేసీ



మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం,నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణకు సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నూతనంగా 108 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించినట్టు జేసీ టి.నిషాంతి ప్రజాప్రతినిధులకు సూచించారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ అంశాలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ నిషాంతి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి 12ఓట్లు పైబడిన చోట్ల కొత్తగా పోలింగ్ కేంద్రాన్ని ప్రతిపాదించినట్టు తెలిపారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1644 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటికి అదనంగా ఓటర్ల పరిమితి, రేషనలైజేషన్ అంశాలను దృష్టిలో పెట్టుకుని 108 కొత్త కేంద్రాలు ప్రతిపాదించామన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 8 పోలింగ్ కేంద్రాలు, ముమ్మిడివరం నియోజకవర్గంలో 39, అమలాపురం నియోజకవర్గంలో 23, రాజోలు నియోజకవర్గంలో 5, పి.గన్నవరం నియోజకవర్గంలో 2, కొత్తపేటనియోజకవర్గంలో 15, మండపేట నియోజకవర్గంలో 16 కొత్త పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించినట్టు ఆమె తెలిపారు. వీటితో కలిపి మొత్తం 1752 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటవుతాయని తెలిపారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా ఎలక్ట్రోల్ మ్యాపింగ్ 38శాతం పూర్తయిందన్నారు. ఫారం-6, 7, 8 క్లెయిమ్‌ల డిస్పోజల్ ప్రక్రియ శరవేగంగా జరుగుతుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ తరపున వడ్డి నాగేశ్వరరావు, బీజేపీ నుంచి దూరి రాజేష్, సీపీఎం నుంచి కారెం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

12వ పీఆర్సీ కమిటీని తక్షణం నియమించాలి

» ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్

అమలాపురంటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పన్నెండో పీఆర్సీ కమిటీని తక్షణం ప్రకటించాలని, అప్పటివరకు తాత్కాలిక భృతి కింద 36శాతం చెల్లించాలని ఏపీమెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్రశాఖ అధ్యక్షుడు వి.సాయి సత్యనారాయణ, ఎ.గిరిబాబు డిమాండ్‌చేశారు. కోనసీమ జిల్లాశాఖ సర్వసభ్య సమావేశం జీవీవీ సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన రాష్ట్ర నేతలు మాట్లాడుతూ జిల్లాలోఉన్న వైద్యఉద్యోగులు అందరూ సంఘటితంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పెండింగ్‌లోఉన్న మూడు సరెండర్ లీవ్ వేతనాలు చెల్లించాలని, డీఏ బకాయిలు విడుదల చేయాలని, పాతపెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరారు. ప్రభుత్వ వైద్యసిబ్బంది సమస్యలపై చర్చించారు. జిల్లా శాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా బి.స్వామిబాబు నామినేషన్లు స్వీకరించారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా సత్యరాజు, జిల్లా అధ్యక్షురాలిగా నక్కా విజయనాగేంద్రకుమారి, జిల్లా కార్యదర్శిగా జీవీవీ సుబ్బారావు, కోశాధికారిగా దుర్గాబాయి, ఉపాధ్యక్షులుగా గణేష్‌కుమార్‌గౌడ్, ప్రసన్నకుమారి, రాకేష్, దుర్గాప్రసాద్, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా వసంతరావు, సంయుక్త కార్యదర్శులుగా సమీర్, ప్రసాద్, అనీషా, సత్యవతి ఎన్నికయ్యారు.

గ్రామ పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగులను

క్రమబద్ధీకరించాలి

» మూడు దశాబ్దాలకుపైగా వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న వేలమంది ఉద్యోగులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

మూడు దశాబ్దాల నుంచి గ్రామ పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగులుగా పంచాయతీల్లో పనిచేస్తూ అనేక విధుల్లో కీలక భాగస్వాములుగా పనిచేస్తున్న సిబ్బంది చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నా ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదు. గ్రామ పంచాయతీల్లో కీలక భాగస్వామ్యం వహించే కాంట్రాక్టు ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఖాతాల నుంచే సిబ్బందికి జీతాలు చెల్లించే విధానాన్ని అమలు చేయాలని ఏపీ రాష్ట్ర గ్రామ పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది. దశాబ్దాల నుంచి కాంట్రాక్టు ఉద్యోగుల సేవలు అందిస్తున్నప్పటికీ వారిని క్రమబద్ధీకరించి ఉద్యోగభద్రత కల్పించాలన్నదే వారి ప్రధాన డిమాండ్. రాష్ట్రంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ట్యాంకు వాచర్, రెవెన్యూ వాచర్, గేట్‌వాల్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్ ఇలా వివిధ రకాల పేర్లతో జిల్లాపంచాయతీ అధికారి పర్యవేక్షణలో సిబ్బంది వేలాదిగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి పంచాయతీ జనరల్ ఫండ్ నుంచి జీతాలు ఇస్తున్నారు. దీనివల్ల కొన్ని ఆర్థికంగా వెనుకబడిన పంచాయతీల్లో జీతాలు చెల్లించలేని పరిస్థితుల్లో వందలమంది ఉద్యోగులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో కాంట్రాక్టు ఉద్యోగులను తెలంగాణా ప్రభుత్వం మాదిరిగా రెగ్యులైజ్ చేసి వారికి నేరుగా జీతాలు చెల్లించాలని కోరుతున్నారు. రాష్ట్రస్థాయిలో వివిధ హోదాల్లో 12,862మంది ఉద్యోగులు ప్రస్తుతం పంచాయతీల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. పంచాయతీల నుంచి చెల్లిస్తున్న చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ, పిల్లలను చదివించుకోలేని పరిస్థితులవల్ల కొన్నేళ్లుగా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీల్లో వీరు వివిధ పనులతోపాటు ఇంటిపన్నుల వసూళ్లు, నాన్ ట్యాక్స్ వసూళ్లు, వీధిలైట్ల మరమ్మతులు చేస్తున్నారు.



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్డీ వెంకటకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగ సంఘ నేతలు

ప్రభుత్వమే జీతాలు చెల్లించాలి

-నల్లా సతీష్‌కుమార్, ఏపీ రాష్ట్ర గ్రామ పంచాయతీ కాంట్రాక్టు వెల్ఫేర్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు



పంచాయతీల్లో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలి.నేరుగా జీతాలు చెల్లించాలి. పంచాయతీల్లో అన్ని పనులను కాంట్రాక్టు ఉద్యోగులే నిరంతరం కష్టపడి పనిచేస్తున్నారు. పన్నుల వసూళ్లలో కీలక పాత్ర వహిస్తున్న తమకు తెలంగాణా మాదిరిగా నేరుగా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలనేది మా ప్రధానమైన డిమాండ్. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను త్వరలో కలిసి మా సమస్యలను వివరించి పరిష్కారం కోరతాం.

ప్రస్తుతం క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి గ్రామ పంచాయతీలను పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వ శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన రూర్బన్, గ్రేడ్‌ల వ్యవస్థలో తమకున్న అనుభవాన్ని, అర్హతలను పరిగణనలోనికి తీసుకుని కాంట్రాక్టు ఉద్యోగులను గ్రేడ్‌ల వ్యవస్థలో భర్తీ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో ఏపీ గ్రామ పంచాయతీ క్రాంటాక్టు ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఉద్యమ బాట పట్టింది. ఇప్పటికే పంచాయతీరాజ్ విభాగంలో ఉన్న ఉన్నతాధికారులతోపాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓఎస్‌డీ కె.వెంకటకృష్ణను అందజేసింది.

ఆరోగ్యంతోపాటు బహుళ ప్రయోజనాల సైక్లింగ్

» జాతీయస్థాయిలో ఉత్తమ ప్రజా స్పందన ప్రాజెక్టుగా ఎంపిక

అమలాపురం రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంతోపాటు బహుళ ప్రయోజనాలు పొందేలా అమలాపురం రూరల్ మండలం వన్నెచింతలపూడి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టు జాతీయస్థాయిలో ఉత్తమ ప్రజాస్పందన ప్రాజెక్టు అవార్డును దక్కించుకుంది. పాఠశాలకు చెందిన విద్యార్థినులు సోరపల్లి శశివదన, ఉండ్రాజవరపు భవ్యశ్రీ ఆరోగ్యం కోసం ఇంట్లో సైక్లింగ్ చేసే విధానాలను దగ్గరగా పరిశీలించారు. సైక్లింగ్‌తో ఆరోగ్యంతోపాటు బహుళ ప్రయోజనాలు పొందేలా సృజనాత్మకంగా ఆలోచించారు. వారికి గైడ్ టీచర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుబ్బల నాగసత్యనారాయణ వైజ్ఞానిక ఆలోచనలను అందించారు. దీంతో ఆ విద్యార్థినులు మల్టీపర్పస్ సైక్లింగ్ మిల్‌ను శాస్త్రీయంగా తయారు చేశారు.

భోపాల్‌లో ప్రదర్శన.. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో 52వ రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శన ఈనెల 18 నుంచి 23 వరకు నిర్వహించారు. రాష్ట్రం నుంచి ఆరు ప్రాజెక్టులను జాతీయస్థాయి పోటీలకు పంపగా కోనసీమ జిల్లానుంచి ప్రాతినిథ్యం వహించిన మల్టీపర్పస్ సైక్లింగ్‌మిల్ ప్రాజెక్టు ఉత్తమ ప్రజాస్పందన ప్రాజెక్టు అవార్డును దక్కించుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పడిన తర్వాత సైన్స్ విభాగంలో ఇది తొమ్మిదో జాతీయ అవార్డును దక్కించుకున్నట్టు జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. విద్యార్థినులను డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమీ అభినందించారు.





వన్నెచింతలపూడి విద్యార్థుల సైక్లింగ్ ప్రదర్శనను పరీక్షిస్తున్న న్యాయాధికారులు

జాతీయస్థాయి అవార్డు అందుకుంటున్న విద్యార్థినులు

ఆలయం వద్ద భోజనాలకు వెళ్లొస్తూ మృత్యుఒడికి...

ఎదురెదురుగా ఢీకొన్న మోటార్‌సైకిల్, ఆర్టీసీ బస్సు

ఒకరు మృతి... మరొకరికి తీవ్రగాయాలు

కాకినాడ జిల్లా గొల్లప్రోలు వద్ద ఘటన



సంఘటనా స్థలంలో మరణించిన కృష్ణారావు, తీవ్రంగా గాయపడిన శ్రీను

గొల్లప్రోలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆలయం వద్ద జరిగిన భోజనాలకు వెళ్లి వస్తూ గొల్లప్రోలు వద్ద ప్రమాదానికి గురై ఒకరు చనిపోగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం నరసింగపురం గ్రామానికి చెందిన ఉండ్రు కృష్ణారావు అలియాస్ రాజు(40) బైపాస్‌రోడ్డులో గల భగవాన్ గోపాల్‌బాబా ఆశ్రమంలో వంట పనిచేస్తున్నాడు. పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో ఉంటున్న గంధం శ్రీను(40)తో కలిసి గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారు సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద జరిగిన భోజనాలకు వెళ్లారు. అనంతరం మోటార్‌సైకిల్‌పై తిరిగి పిఠాపురం వస్తున్నారు. గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు నుంచి 216వ జాతీయ రహదారికి వెళ్లే జంక్షన్ వద్దకు వచ్చేసరికి కాకినాడ నుంచి తుని వెళ్తున్న ఆర్టీసీ బస్సు పట్టణంలో నుంచి ఎన్‌హెచ్‌పైకి వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. మోటార్‌సైకిల్ ఆర్టీసీ బస్సు చక్రం కింద ఇరుక్కుపోయింది. ఈ సంఘటనలో ఉండ్రు కృష్ణారావు అక్కడికక్కడే మరణించాడు. శ్రీనుకి తీవ్ర గాయాలు కాగా పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హైవే మొబైల్, గొల్లప్రోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సు చక్రాల కింద మోటార్‌సైకిల్

పి.గన్నవరంలో తాచుపాము హల్‌చల్



బుసలు కొడుతున్న తాచుపాము



పామును డబ్బాలో బంధించిన గణేష్‌వర్మ

పి.గన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట మన్నే వెంకట సత్యనారాయణమూర్తి నివాసంలో ఆదివారం తాచుపాము హల్‌చల్ చేసింది. పామును స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ పట్టుకున్నాడు. ఈ పాముకు సుమారు 20 ఏళ్ల వయస్సు ఉంటుందని తెలిపాడు. రక్తపింజరం జాతి పాములతో అప్రమత్తంగా ఉండాలని సూచించాడు. తాను డబ్బాలో బంధించిన పాములను జనావాసాలు లేని చోట వదులుతానని గణేష్‌వర్మ తెలిపాడు.

పాపికొండలకు పర్యాటకులు..

వీఆర్‌పురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాపికొండల విహారానికి 600 మంది పర్యాటకులు 10 పర్యాటక బోట్లలో వెళ్లారు. ఆదివారం సెలవు కావడంతో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి పాపికొండలు-పేరంటాలపల్లి ప్రకృతి అందాలను తిలకించేందుకు ఎక్కువమంది తరలివచ్చారు. గోదావరిలో బోట్లలో వెళ్లడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పర్యాటకులు తెలిపారు. ముందుగా పేరంటాలపల్లి చేరుకుని మునిమఠం, శివాలయాన్ని దర్శించుకున్నారు. తర్వాత పాపికొండలకు బయలుదేరి ప్రకృతి అందాలను చూసి ఆనందం పొందారు.



పోచవరం ఫెర్రి పాయింట్ దగ్గర పర్యాటకుల సందడి

స్నేహితులతో సరదాగా బీచ్‌కు వెళ్లి...

సముద్రంలో బాలుడి గల్లంతు

పోలీసుల గాలింపు చర్యలు



మహిమరాజు (ఫైల్)

మలికిపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో సరదాగా బీచ్‌కు వెళ్లిన బాలుడు సముద్రంలో గల్లంతయ్యాడు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మోరి అరుంధతి పేట గ్రామానికి చెందిన మహిమరాజు (14) అలియాస్ బబ్లూ 9వ తరగతి వరకు చదివి ఒక ప్రైవేటు స్కూలు బస్సు క్లీనర్‌గా పనిచేసేవాడు. స్కూలు యాజమాన్యం జీతాలు సరిగా ఇవ్వకపోవడంతో ఆ పని కూడా మానేసి ఖాళీగా ఉంటున్నాడు. ఆదివారం తన స్నేహితులు చుట్టుగుళ్ల ముకేష్, వాస్కూరి సూర్యగణేష్, కొప్పాడి రాకేష్‌తో కలసి చింతలమోరి బీచ్‌కు వెళ్లాడు. వారంతా ఇసుక తిన్నెలపై ఆటలాడుకుని ఫొటోలు తీసుకున్నారు. త ర్వాత బబ్లూ, ముకేష్ స్నానానికి దిగారు. కెరటాలు ఉధృతంగా రావడంతో బబ్లూ సముద్రంలో కొట్టుకుపోయాడు. ముకేష్ ఇచ్చిన సమాచారంతో బంధువులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బబ్లూ తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ బి.సురేష్ తెలిపారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సంఘటనపై ఆరా తీశారు. పోలీసులతో మాట్లాడి తగు చర్యలు వెంటనే తీసుకోవాలని ఆదేశించారు. కాగా సూర్యగణేష్, ముకేష్, రాకేష్ మోరి జిల్లా పరిషత్ హైస్కూలులో పదో తరగతి చదువుతున్నారు. బాలుడు గల్లంతుకా వడంతో మోరి అరుంధతి పేటలో విషాదచాయలు అలుముకున్నాయి.

విహారయాత్రలో విషాదం

సోకిలేరు వాగులో మునిగి విజయవాడకు చెందిన జిమ్ ట్రైనర్ మృతి



మృతిచెందిన సందీప్ (ఫైల్)

చింతూరు/మోతుగూడెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పోలీసుస్టేషను పరిధిలోని సోకిలేరు వాగులో మునిగి జిమ్ ట్రైనర్ కె.సందీప్ (30) మృతిచెందాడు. మోతుగూడెం ఎస్‌ఐ ఎస్కే సాధిక్ తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడకు చెందిన 13మంది స్నేహితులు 3 కార్లలో ఆదివారం ఉదయం విహారయాత్రకు మారేడుమిల్లి వచ్చారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో చింతూరు మండలం సోకిలేరు వ్యూ పాయింట్ పరిసర ప్రాంతాలకు వచ్చారు. సోకిలేరు వాగు ఒడ్డున వంట తయారీ పనిలో కొంతమంది నిమగ్నమయ్యారు. వారిలో ఒకరైన నరేంద్ర ముందుగా వాగులో స్నానం చేసి తిరిగి ఒడ్డుకు వచ్చాడు. తదుపరి జిమ్‌ట్రైనర్ అయిన కె.సందీప్ స్నానానికి వాగులో దిగాడు. కొద్దిదూరం ఈతకొట్టి తిరిగి ఒడ్డుకు చేరే క్రమంలో నీటిలో మునిగిపోయాడు. స్నేహితుడు మునిగిపోతున్న విషయం గుర్తించిన మిగిలిన వారంతా సందీప్‌ని రక్షించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చివరకు సందీప్ ప్రాణాలు వదలగా మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. అక్కడి నుంచి చింతూరు ఏరియా ఆసుపత్రికి అంబులెన్సు సహకారంతో తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. కాగా ఈ 13 మందిలో నలుగురు జిమ్ ట్రైనర్లు ఉన్నారు.



ఖోఖో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

కాకినాడలో రెండో రోజు

అంతర్ జిల్లాల ఖోఖో పోటీలు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడాసమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్‌ఏలో రెండోరోజు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ఏ అంతర్ జిల్లాల బాలుర ఖోఖో పోటీలు ఆదివారం ఉల్లాసంగా జరిగాయి. ప్రకాశం, చిత్తూరు, విశాఖ, గుంటూరు జిల్లాల క్రీడాకారులు పోటీపడ్డారు. రాష్ట్ర ఖోఖో సంఘ కార్యదర్శి సీతారామ రెడ్డి, కోశాధికారి ఎల్.గోవిందరాజు, కాకినాడ జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి మాచరరావు, టోర్నమెంట్ నిర్వహణా కార్యదర్శి కె.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి పట్టాభి, ఎస్‌కెడిఎస్ స్కూల్ చైర్మన్ ప్రభువర ప్రసాద్, గంగనాపల్లి మాజీ ప్రసిడెంట్ నాగబాబు, ఖోఖో కోచ్ వాసులు పోటీలను తిలకించి పర్యవేక్షించారు. సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరిష్ అందించిన టీ షర్టులను ఆవిష్కరించారు. క్వాటర్ ఫైనల్స్‌లో తూర్పుగోదావరి జిల్లాపై విశాఖ జిల్లా 3 పాయింట్ల తేడాతోను, నెల్లూరుపై గుంటూరు ఒక పాయింట్ తేడాతోను, విజయనగరంపై చిత్తూరు 3 పాయింట్ల తేడాతోను, కర్నూలుపై ప్రకాశం 10 పాయింట్ల తేడాతో గెలుపొందాయి. పోటీల నిర్వహణలో పీడీలు, పీఈటీలు సహకారం అందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి ప్రథమ చికిత్స శిబిరం నిర్వహించారు.

జూడో పోటీలు

కాకినాడ జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్స్ జూడో పోటీలు కాకినాడ డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఆదివారం రెండో రోజు ఉత్సాహంగా జరిగాయి. బాలురు, బాలికల విభాగంలో నిర్వహిస్తున్న పోటీల్లో 7 వెయిట్ కేటగిరిల్లో బాలికలకు, బాలురకు నిర్వాహకులు పోటీలు నిర్వహించారు. బాలికల పోటీలను రాష్ట్ర సంఘ సీఈవో వెంకట్, బాలుర పోటీలను జూడో సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ట్రజరర్ రమణ ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారుల నుంచి జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రజట్టును ఎంపిక చేయనున్నారు. జాతీయస్థాయి పోటీలు మణిపూర్‌లో డిసెంబరు 11 నుంచి 15 వరకు జరుగుతాయి. కాకినాడ జూడో సంఘ చైర్మన్ వెంకట కృష్ణారావు, డిసిప్లేన్ కమిటీ కాజా మస్తాన్, టోర్నమెంట్ పరిశీలకులు పి.వి.తేజ, కార్యదర్శి పవన్ సందీప్, గోవిందు, రామకృష్ణ, స్టేట్ జాయింట్ సెక్రటరీ గమిడి శ్రీనివాసరావు, ఉషరాణి పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతులు అందించారు. డీఎస్‌ఏ జూడో కోచ్, క్రీడాకారులు, కోచ్లు, మేనేజర్లు పాల్గొన్నారు.



జూడో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కాకినాడ జీజీహెచ్‌కు నేడు డీఎంఈ రాక

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణి మృతిచెందిన ఘటనలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విచారణ నిర్వహించేందుకు రాష్ట్ర వైద్య సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ జి.రఘునందన్ సోమవారం కాకినాడ జీజీహెచ్‌కు రానున్నారు. విచారణ నిర్వహించాలని వైద్య,ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్‌గౌర్ ఆదేశించిన నేపథ్యంలో నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. ఘటన జరిగిన కారణాలతో పాటు దారితీసిన పరిస్థితులపై ఆరా తీయనున్నారు. విచారణానంతరం ఈ నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తారు.

కూరగాయల మాటున గంజాయి

రూ.1.67 కోట్ల విలువైన 332.91 కిలోల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం

రవాణా చేస్తున్న నలుగురి అరెస్టు... రిమాండ్‌కు తరలింపు : డీఎస్పీ విద్య



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య

రాజమహేంద్రవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ట్రేల మధ్య గుట్టు చప్పుడు కాకుండా రవాణా చేస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. ఈ వివరాలను ఆదివారం డీఎస్పీ విద్య వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ ఆర్.మురళీమోహన్‌కి గంజాయి రవాణాపై విశ్వసనీయ సమాచారం అందింది. దీని ఆ ధారంగా శనివారం సాయంత్రం జీరో పాయింట్ వద్ద వాహన తనిఖీలను చేస్తుండగా రాజానగరం వైపు నుంచి వచ్చిన వ్యాను, కారులోని వ్యక్తులు అనుమానాస్పదంగా ప్రవర్తించారు. దీంతో ఆ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వ్యానులోని కూరగాయల ట్రేల మధ్యలో 12 గంజాయి మూటలు, కారు డిక్కీలో ఒక గంజాయి మూటను గుర్తించారు. వాటిలో రూ.1.67 కోట్లు విలువైన 332.91 కిలోల గంజాయి ఉంది. ఆ గంజాయితో పాటు రూ.4.5 లక్షల విలువైన 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. గంజాయిని ఒడిశాలోని బరంపురంలో రాము అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి కర్నాటక తీసుకెళ్తున్నారని చెప్పారు. ఈ కేసులో కర్నాటకలోని చిక్‌బళ్లాపూర్ జిల్లా గౌరీబిదనూర్ మండలానికి చెందిన ఇస్మాయిల్ షరీఫ్, ముస్తాన్ అలీఖాన్, మన్సూర్, తుమకూరు జిల్లా హంగాడ కాలనీకి చెందిన సుల్తాన్ సలీంని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, షరీఫ్‌పై కర్నాటకలోగంజాయి కేసులున్నాయన్నారు.

తాబేళ్లు తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడితో ఫారెస్ట్ పోలీసులు

మోతుగూడెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చదలవాడ పంచాయతీ తులసిపాక ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద తాబేళ్లు తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ విజయ కుమార్, ఫారెస్ట్ హెల్పర్ వాహనాలు తనిఖీలు చేస్తుండగా టిప్పర్ ఆటోలో 8 గోనె సంచులతో 248 తాబేళ్లు తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. నెల్లూరి విశాఖ అనే వ్యక్తి రావులపాలెం నుంచి ఒడిస్సా రాష్ట్రం తీసుకెళ్తున్నాడని, 248 తాబేళ్లకు 230 బతికున్నాయని 18 చనిపోయాయని విజయకుమార్ పేర్కొన్నారు. నిందితుడిని కోర్టు తలిస్తామని తెలిపారు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయుల ఎంపిక



ఎంపికైన ఉపాధ్యాయులు

ఎటపాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి క్రీడా పోటీలకు అల్లూరి జిల్లా ఎటపాక మండలం నల్లకుంట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న పీడీ సొడే నాగిరెడ్డి, సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ పెనుబల్లి లక్ష్మణ్‌రావు ఎంపికయ్యారు. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో వీరిద్దరు ప్రతిభ కనబర్చారు. పీడీ నాగిరెడ్డి షాట్‌పుట్‌లో ప్రథమస్థానంతోపాటు వందమీటర్ల పరుగు పందెంలో తృతీయస్థానంలో నిలిచారు. పీఈటీ పెనుబల్లి లక్ష్మణ్‌రావు వందమీటర్ల పరుగుపందెంలో ప్రథమస్థానం తోపాటు లాంగ్ జంప్‌లో ద్వితీయస్థానంలో నిలిచారు. దీంతో బిహార్ రాజధాని పాట్నాలో వచ్చే నెల 13 నుంచి 15 వరకు జరిగే జాతీయస్థాయి ఉద్యోగస్తుల క్రీడా పోటీల్లో ఇద్దరు పాల్గొననున్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

రాజవొమ్మంగి నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయలయ్యాయి. రాజవొమ్మంగికి చెందిన బైరున్ అబ్దుల్ ద్విచక్రవాహనంపై సూరంపాలెం వైపు హైవేపై వెళ్తుండగా రాజవొమ్మంగి గ్రామశివారులో టాటా ఏస్ వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో అబ్దుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రాజవొమ్మంగి ప్రభుత్వాసుపత్రికి, ఆపై కాకినాడ ఆసుపత్రికి తరలించారు.

ఆలయాల్లో చోరీలు.. దొరికిన దొంగలు!

బంగారం, వెండి వస్తువులు,

ఆటో, మోటార్‌సైకిల్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి వస్తువులు



పట్టుబడిన నిందితులతో పోలీసులు

గోకవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం లోని 2 ఆలయాల్లో చోరీకి పాల్పడిన ఇద్దరిని ఆదివారం అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ పవన్ కుమార్ తెలిపారు. గోకవరం మండలం కొత్తపల్లిలో రాజలింగేశ్వరస్వామి ఆలయంలో సెప్టెంబరు 16న, గోకవరం గ్రామ శివారున ఉన్న గంగాలమ్మతల్లి గుడి ఆలయంలో అక్టోబరు 21న గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. చివరకు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. అల్లూరి సీతారా మరాజు జిల్లా ఎటపాక మండలం తుమ్మల నగరం గ్రామానికి చెందిన పేరాల నరసింహరావు, పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన గుండి జగదీష్‌ను అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. వారి నుంచి 12 గ్రాముల బంగారం శతమానాలు, సుమారు కిలో వెండి వస్తువులు, ఆటో, మోటార్‌సైకిల్, హుండీలో దొంగి లించిన రూ.2,000 చిల్లరను స్వాధీనం చేసు కున్నామన్నారు. నిందితులు గోకవరంతో పాటు రాజానగరం, రంపచోడవరం పరిసర ప్రాంతాల్లో కూడా నేరాలు చేసినట్టు చెప్పారు.

పల్ల వెంకన్న నర్సరీని సందర్శించిన ఐజీ హరికృష్ణ

కడియం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియంలో పల్ల వెంకన్న నర్సరీని ఐజీ (స్పెషల్) హరికృష్ణ సందర్శించారు. నర్సరీ రైతులు పల్ల వెంకటేష్, వినయ్ ఆయనకు స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులతో కలిసి నర్సరీని సందర్శించిన హరికృష్ణ నర్సరీలో వివిధ రకాల మొక్కలు చూశారు. నర్సరీ పచ్చని అందాలతో ఉందని, కొత్త రకాల మొక్కలు, నర్సరీ నిర్వహణ చూసి ఐజీ ప్రశంసించారు. గతంలో జిల్లా ఎస్పీగా పనిచేసిన సమయంలో నర్సరీ రైతులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. జిల్లా స్పెషల్ బ్రాంచి డీఎస్పీ రామకృష్ణ, కడియం సీఐ ఏ.వెంకటేశ్వరరావు, ఎస్‌బీ జనార్ధన్ పాల్గొన్నారు.



ఐజీ హరికృష్ణకు మొక్క అందజేస్తున్న పల్ల వెంకన్న నర్సరీ రైతులు

అయినవిల్లిలో ఉన్నతాధికారుల పూజలు



రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్‌కు చిత్రపటం అందజేస్తున్న ఈవో



ఆలయంలో అధికారులకు వేదాశీర్వచనం అందిస్తున్న అర్చకులు

అయినవిల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రసిద్ధి చెందిన అయినవిల్లి శ్రీ సిద్ధివినాయక దేవస్థానానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదివారం విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 108 కొబ్బరికాయల మొక్కు తీర్చుకున్నారు. అలాగే కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి, కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, అధికారులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధానార్చకులు అధికారులకు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. విజయానంద్ మాట్లాడుతూ దేవస్థాన నిర్వహణ, పూజా విధులకు సంబంధించి ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామన్నారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్, తహశీల్దార్ విద్యాపతి పాల్గొన్నారు.

సత్యదేవుడికి ఎస్టీ కమిషన్ చైర్మన్ పూజలు



రథంపై విహరిస్తున్న సత్యదేవుడు,అనంతలక్ష్మి అమ్మవార్లు



సత్యదేవుడి దర్శనానంతరం ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి

అన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.

ఘనంగా రథోత్సవం

సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవయిన రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పురాజగోపురం వద్ద ఉంచిన రథం వద్దకు బాజాభజంత్రీలతో తోడ్కొనివచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

ఉత్తమ ఫలితాల సాధనకు ప్రధానోపాధ్యాయుల కృషి

ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీ రాజశేఖరం

75 వసంతాల ఏపీహెచ్‌ఎంఏ లోగో ఆవిష్కరణ



ఏపీహెచ్‌ఎంఏ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం

సర్పవరం జంక్షన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ప్రభుత్వం కీలక సంస్కరణలు తీసుకొచ్చిందని, నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించడంలో ప్రధానోపాధ్యాయుల కృషి ఎంతో ఉందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ (ఏపీహెచ్‌ఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వూరి రవి అధ్యక్షతన ఆదివారం కాకినాడ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 75వ వార్షికోత్సవ వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం ఏర్పడి 75 వసంతాలు పూర్తి చేసుకోవడం, ఇందులో భాగస్వాములుగా ఉండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రధానోపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీఇచ్చారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయుని పోస్టుని గ్రేడ్-1గా ఉద్యోగోన్నతి కల్పించి డీడీవోగా చేయాలని, డైట్ సీనియర్ లెక్చరర్, సెక్టోరల్, సమగ్ర శిక్షాలో ఏపీసీ పోస్టుల్లో సీనియర్ హెచ్‌ఎంలను నియమించాలని, ప్లస్ 2 పాఠశాలలను బలోపేతం చేయాలని, స్కూల్ అసిస్టెంట్లకు పీజీటీలుగా, హెచ్ ఎంలకు ప్రిన్సిపాల్స్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలని తీర్మానం చేశారు. 75 వసంతాల ఏపీహెచ్‌ఎంఏ లోగోని ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్షులు కూర్మారావు, మోకా ప్రకాష్, రమణారావు, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, గణేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

నిత్య సుదర్శన హోమానికి విరాళం

అంతర్వేది, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య సుదర్శన హోమానికి కాకినాడకు చెందిన కాపగంటి వీర సూర్యప్రసాద్-గుణవతి దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు. దాతలకు ఆలయ అర్చకులు, అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

వాడపల్లి వెంకన్న భక్తులకు 108 సేవలు

ఆత్రేయపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 108 సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ఆధ్వర్యంలో 108 అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు.

ఘనంగా సత్యసాయి శతజయంతి వేడుకలు





ముమ్మిడివరం: సత్యసాయిబాబాకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు, ఎంపీ హరీష్, అల్లవరం:మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు, పి.గన్నవరం: బాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గిడ్డి

● సత్యసాయి మందిరాల్లో పూజలు, మేలుకొలుపు, సుప్రభాత సేవ

అమలాపురం టౌన్/రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయి శతజయంతి వేడుకలను ఆదివారం అమలాపురం మోబర్లీపేటలో విశ్రాంత శాస్త్రవేత్త కేఎస్ఎన్ రావు స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా భగవాన్ శ్రీసత్యసాయి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ సైనికోద్యోగులను ముఖ్య అతిథిగా హాజరైన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం పర్సనల్ సెక్రటరీగా పనిచేసిన లెఫ్టినెంట్ కల్నల్ టి.కాశీ విశ్వేశ్వరుడు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులకు స్కూలు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, కల్వకొలను తాతాజీ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బండారులంకలో శ్రీసత్యసాయిబాబా జయంతి ఉత్సవాలను కొండా కుమార్ తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున నగర సంకీర్తనతో ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేదలకు వస్త్రదానం చేశారు. కొండా చిన్నా, లక్కింశెట్టి సోమేశ్వరరావు, కుర్మా నాగసత్యం, శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, చింతా అత్తిలింగం, వీరభద్రమణి తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): మావుళ్ళమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం పుట్టపర్తి సత్యసాయిబాబా జయంతి వేడుకలునిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆణివిళ్ళ సాయిబాబా ఆధ్వర్యంలో పురోహితుడు ఫణికాంత్‌శర్మ ఆచార్యత్వంలో వేడుకలు నిర్వహించారు. ఆణివిళ్ళ రామకృష్ణపరమహంస, గ్రంధి రాంప్రసాద్, ఆణివిళ్ళ శాంతాసుబ్బలక్ష్మి, సంసాని శ్రీనివాస్, రత్నప్రసాద్, లక్కోజు వెంకటేశ్వరరావు, వేదుల శ్రీను, తాతపూడి బుల్లి పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం అక్విడెక్టు వద్ద శ్రీషిరిడిసాయి, సత్యసాయి సేవా మందిరంలో శ్రీభగవాన్ శ్రీసత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి మేలుకొలుపుసేవ, ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, ప్రశాంతి పతాకావిష్కరణ, జ్యోతి ప్రజల్వన, శ్రీభగవాన్ సత్యసాయిబాబా, షిర్డిసాయి బాబాలకు పుష్పమాలంకరణ నిర్వహించారు. అనంతరం అధికసంఖ్యలో మహిళలు పాల్గొనగా సాముహిక సాయివ్రతాలు నిర్వహించారు. గాజులగుంట పరిధిలో ప్రభలదిబ్బలో ఉన్న శ్రీసత్యసాయి మండల ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు పెన్నులు, పులిహోర పంపిణీ చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. అనంతరం నామసంకీర్తన, మంగళహారతి - పవళింపుసేవ నిర్వహించారు. స్వామివారిని పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఇరిగేషన్ డీఈ ప్రసాద్‌రాజు, ఎంపీడీవో ఎం.మల్లికార్జునరావు, డాక్టర్ కడలి సత్యనారాయణ, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ నీలిమ, పి.గన్నవ రం నీటిసంఘం డిస్ట్రిబ్యూటరి కమిటీ ఉపాధ్యక్షుడు చొల్లంగి సత్తిబాబు, నాయకులు ఆరుమల్లి సాయిబాబు, గుబ్బల కృష్ణ, పులపర్తి సుజాత, శేరు శ్రీనుబాబు, దొంగ రమణ, కొండ సత్యనారాయణ, శ్రీసత్యసాయి సేవాసమితిసభ్యులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): భగవాన్ పుట్టపర్తి సత్యసాయిబాబా బోధనలు ఆచరణీయమని ఎంపీడీవో జి.కృష్ణ అన్నారు. గొల్లవిల్లిలో శ్రీసత్యసాయి సేవాసమితి కన్వీనర్ బద్రి సాయిప్రసాద్ పర్యవేక్షణలో అధికారికంగా నిర్వహించిన సత్యసాయి జయంత్యుత్సవాల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. మానవ సేవ ద్వారా ప్రతి ఒక్కరూ మోక్షం సాధించవచ్చన్న సత్యసాయి బోధనలు ఎల్లప్పుడూ ఆచరణీయమన్నారు. వేకువజామున నగరసంకీర్తన నిర్వహించారు. అనంతరం సాయిభజన, పూజాకార్యక్రమాలు జరిగాయి. భక్తులందరికి బద్రి సాయిప్రసాద్ ఆధ్వర్యంలోఅన్నసమారాధన నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయ పాలనాధికారి బీహెచ్ తులసీకృష్ణ, శ్రీసత్యసాయి భజనమండలి కన్వీనర్ పేరాబత్తుల శ్రీనివాసరావు, సత్యసాయి సేవాదళ్ సభ్యులు వల్లభరెడ్డి రాజు, పేరాబత్తుల రాజా, వాకపల్లి రామకృష్ణ, గనిశెట్టి వెంకట్రాజు, వీలు నాగేశ్వరరావు, గుద్దటి వెంకటేశ్వరరావు, వాలా రాజా, వాలా కిరణ్, దొడ్డి శ్రీను, వాకపల్లి మణి, పేరాబత్తుల చందు, మద్దిరెడ్డి చరణ్, నాగిరెడ్డి సాయి, నిమ్మకాయల సాయిరామ్, రెవెన్యూ, మండలప్రజాపరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భగవాన్ శ్రీసత్యసాయి బాబా శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో మమత, డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్, నాయకులు నాగాబత్తుల వెంకటసుబ్బారావు, వాసంశెట్టి పెదబాబు, కొప్పినీడి ఈశ్వరరావు, కాసు సాయిబుజ్జి, షైలా ఆనందరావు, కార్యాలయ ఉద్యో గులు, సిబ్బంది పాల్గొన్నారు. కొర్లపాటివారిపాలెంలో ఉన్న సత్యసాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా సత్యసాయిబాబా సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శ్రీసత్యసాయిబాబా శత జయంతి వేడుకలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీసత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, అడబాల విజయ్, కడలి మోహన్, సీనియర్ అసిస్టెంట్ చక్రవర్తి పాల్గొన్నారు.

అల్లవరం (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరూ ఆధ్యాత్మిక, మానవతా విలువలు పెంచుకుని భగవాన్ సత్యసాయి ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. కొమరగిరిపట్నంలో సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా బాబావారిని దర్శించుకుని కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొమరగిరిపట్నం సత్యసాయి సేవాదళ్ ఆధ్వర్యంలో ఆదివారం నగర సంకీర్తన, సామూహిక సాయి సత్యవ్రతాలు, వంద భజన గేయాలాపనలు, నారాయణసేవ, ఉయ్యాల సేవ ఘనంగా జరిగాయి. సీనియర్ జర్నలిస్టు నడింపల్లి సీతారామరాజు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, తహశీల్దార్ వీవీఎల్ నరసింహం, ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, వేగిరాజు వెంకట్రాజు, నడింపల్లి శ్రీనివాసరాజు, గుర్రం అన్నవరం, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, మంతెన సురేష్‌రాజు, కేవీ, జనసేన నాయకులు కంకిపాటి వీరబాబు, నల్లా రాము, పిండి గణపయ్య, కంకిపాటి గోపి పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా ఆదర్శనీయులని, ఆయన బాటలో ప్రతీ ఒక్కరూ పయనించాలని సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, సొసైటీ చైర్మన్ ఈలి శ్రీనివాస్ పేర్కొన్నారు. మామిడికుదురు శివాలయంలో ఆదివారం జరిగిన సత్యసాయిబాబా జయంతి వేడుకల్లో వారు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక బోధనల ద్వారా మానవ సేవే మాధవ సేవ అని నిరూపించారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.భవానీ, పంచాయతీ కార్యదర్శి డి.కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): భక్తి, సేవా గుణాలు చాటుతూ మనకు కనిపించని దైవం పుట్టపర్తి సత్యసాయిబాబా అని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. ఆదివారం సత్యసాయిబాబా జయంత్యుత్సవాలు పురస్కరించుకుని అన్నంపల్లి పంచాయతీ పరిధి లక్ష్మీదేవిలంక గ్రామంలో బాబా భక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడారు బాబా వంద సంవత్సరాల పుట్టినరోజు కేక్‌ను కట్‌చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వాముల సందడి

మామిడికుదురు, నవంబరు23(ఆంధ్రజ్యోతి): నాలుగు గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు. పెదపట్నంలంకలో 20మంది, మొగలికుదురులో 20 మంది, లూటుకుర్రులో 8 మంది, అప్పనపల్లిలో 8మందికి గురుస్వామి వర్ధినేని బుజ్జి ఇరుముళ్లు కట్టారు. అనంతరం శబరిమల యాత్రకు వెళ్లారు. ఆయా గ్రామాల్లోని శివాలయాలు అయ్యప్ప శరణుఘోషతో మార్మోగాయి.

కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

● ఎమ్మెల్యే దాట్ల, ఎంపీ హరీష్

ముమ్మిడివరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ హరీష్ మాధుర్ పేర్కొన్నారు. గేదెల్లంక గ్రామంలో పలు అభివృద్ధి పనులకు వారుశంకుస్థాపన చేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.184.44లక్షలతో గ్రామంలో పీఆర్ రోడ్డు నుంచి లంకాఫ్ గేదెల్లంక ఉత్తరవాహిని త్రివేణి సంగమం పుష్కర రోడ్డు వరకు సీసీ రోడ్డు, ఇతర అభివృద్ధి పనులు చేస్తు న్నట్టు తెలిపారు. ఈ రోడ్డు ఆవశ్యకతను గ్రామస్తుడు ట్విట్టర్‌వేదికగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వివరించడంతో తక్షణమే స్పందించి నిధులు విడుదల చేసినందుకు ఎంపీ హరీష్ ధన్యవాదాలు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, దాట్ల బాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



గేదెల్లంకలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనచేసి శిలాఫలకం ఆవిష్కరించిన ఎంపీ హరీష్, ఎమ్మెల్యే సుబ్బరాజు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

ముమ్మిడివరం నగర పంచాయతీ 10వ వార్డులో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే బుచ్చిబాబు మాట్లాడుతూ ఆసుపత్రి భవన సముదాయానికి కావాల్సిన మౌలిక వసతులు, అధునాతన పరికరాలు, ఫర్నిచర్‌ను సమకూరుస్తామన్నారు. ఎంపీ హరీష్ మాట్లాడుతూ రూ.98.50లక్షలతో ఈహెల్త్ సెంటర్‌ను నిర్మించామని, ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రికి చేరుకునే రహదారి అభివృద్ధికి రూ.19లక్షలు మంజూరు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, కమిషనర్ పి.రవివర్మ, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, దాట్ల పృధ్వీరాజ్, గొలకోటి దొరబాబు, ఎం.బాలకృష్ణ, తాడి నరసింహారావు, దాట్ల బాబు, కట్టా సత్తిబాబు, అడబాల సతీష్‌కుమార్, సరిపెల్ల శ్రీనురాజు, మాదాల బుజ్జి, పొద్దోకు బాలు, బోనం కృష్ణ, విళ్ల వీరాస్వామినాయుడు, గొల్లపల్లి గోపి, దివి విజయ్, ఎస్ఎంఎస్ ప్రసాద్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది, ఎతఈ కె.శ్రీనివాస్, ఆర్పీలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, సచివాలయ, మెప్మా, నగరపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్లోబల్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ఐ.పోలవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఎడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ (అమెరికా) చైర్మన్ డాక్టర్ భూపతి రాజు పెండాని అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ ప్రశంసించారు. గ్లోబల్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో మురమళ్ళ బైర్రాజు ఫౌండేషన్ వద్ద ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటును ఆదివారం వారు ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ నడింపల్లి వెంకటరామరాజు, లైజన్ ఆఫీసర్ పీవీఆర్ వర్మ, దాట్ల పృధ్వీరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు సాగిరాజు సూరిబాబురాజు, దేవస్థానం చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, చెల్లి అశోక్, నడింపల్లి సూర్యవర్మ, తాడి నరసింహారావు, జంపన బాబు, ఏలూరి మూర్తి పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు ఆర్థిక సహాయం

కాట్రేనికోన, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పల్లంలో ఆదివారం మొందా తుఫాన్ బాధితులకు సహాయం పంపిణీ జరిగింది. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ 2,685 కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.1000 వంతున రూ.26.85లక్షల సహాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, మండల టీడీపీ అధ్యక్షుడు చెల్లి సురేష్, నడింపల్లి సుబ్బరాజు, పీఎస్ఎన్ రాజు, దండుప్రోలు సత్యం, బొమ్మిడి లింగేశ్వరరావు, విత్తనాల బుజ్జి పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో పోటీ చేసి మంత్రినవుతా'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

యానాం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వచ్చే యానాం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి, విజయం సాధించి మంత్రిని అవుతానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. ఆదివారం స్థానిక ఫెర్రీరోడ్డులో జరిగిన తన కుమారుడు గొల్లపల్లి గంగాధర్ ప్రతాప్‌రాజా మొదటి పుట్టినరోజు వేడుకల్లో ఆయన మాట్లాడారు. ముందుగా ఎమ్మెల్యే అశోక్, లక్ష్మీస్నేహ దంపతుల ఆధ్వర్యంలో కుమారుడి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. తండ్రి ఆశయంతో తాను రాజకీయాల్లో వచ్చానని, తనను ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలపించారని, మరోసారి ఆశీర్వదించాలని, ఈసారి మంత్రిని అవుతానన్నారు. ప్రస్తుతం తాను బీజేపీ కూటమితోనే ఉన్నానని గొల్లపల్లి స్పష్టం చేశారు. కుమారుడి పుట్టినరోజు వేడుకకు అభిమానులు, నాయకులు, ప్రజలు తరలిరావడంపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, యానాం ప్రముఖులు, నాయకులు, ప్రజలు తరలివచ్చి ఎమ్మెల్యే కుమారుడికి పుట్టినరోజు శుభాకాంక్షాలు తెలిపారు.

వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దు



మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి తదితరులు

అమలాపురంటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని పరిరక్షణ కమిటీ కోకన్వీనర్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి డిమాండ్ చేశారు. పీపీపీ పేరుతో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే వైద్య విద్య పూర్తిగా కార్పొరేట్ల కబంధ హస్తాల్లోకి పోయి పేదలకు వైద్య విద్యతో పాటు వైద్య సౌకర్యం అందని ద్రాక్షలా మారిపోతుందన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం యూటీఎఫ్ హోంలో లక్ష్మణరెడ్డి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. జైభీమ్‌రావు భారత పార్టీ వ్యవస్థాపకుడు జడ శ్రావణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య రంగాన్ని నిర్వీర్యంచేసి ప్రైవేటు పరం చేయడానికి మొగ్గుచూపడం దురదృష్టకరమన్నారు. పీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.బలరామ్ మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని కూటమి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కోకన్వీనర్ కొరివి వినయ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర నాయకుడు కె.సత్తిబాబు, పరిశ్రమలశాఖ పూర్వ అడిషనల్ డైరెక్టర్ ఏవీ పటేల్, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, మాజీ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఐఎన్ మల్లేశ్వరరావు, నాయకులు రేవు తిరుపతిరావు, గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్, కామన ప్రభాకరరావు మాట్లాడారు.

నేటి నుంచి బాల బాలికల ఫెన్సింగ్ టోర్నమెంట్

అంతర్వేది, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం మోరి జానసుబ్బమ్మ మెమోరియల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 69వ ఆంధ్రప్రదేశ్ అంతర్‌జిల్లాల ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల ఫెన్సింగ్ టోర్నమెంట్, సెలక్షన్స్ 2025-26 ఆటల పోటీలు సోమవారం నుంచి జరగనున్నాయని ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌కృష్ణ తెలిపారు. ఈనెల24, 25, 26 తేదీల వరకు జరిగే ఫెన్సింగ్ టోర్నమెంట్‌ను సోమవారం ఉదయం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా ప్రారంభిస్తారని తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక



అమలాపురంటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల అసోసియేషన్ జిల్లాశాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎంఏ కిరణ్‌కుమార్, పరిశీలకునిగా ఆరుమల్లి కల్యాణ్‌కుమార్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా కె.గణేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా అడబాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ జబీన్, సంయుక్త కార్యదర్శిగా పీయూఎంఎస్‌సీహెచ్‌వీఎస్ఎన్‌రాజు, కోశాధికారిగా ఎం.నాగరాజు, కౌన్సిలర్‌గా ఎన్.కృష్ణ ఎన్నికయ్యారు. వీరితో రాష్ట్ర అధ్యక్షుడు రవి ప్రమాణ స్వీకారం చేయించారు.

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న చంద్రశేఖర్ తదితరులు

అమలాపురం టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ క్రీడాకారులు ఎంపిక కావడంతో ఆదివారం గారపాటి చంద్రశేఖర్ అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 పవర్ లిఫ్టింగ్ పోటీల్లో హెల్త్ అండ్ ఫిట్‌నెస్‌జిమ్ క్రీడాకారులు బాలికల విభాగంలో 76కిలోల కేటగిరీలో వై.ఇందిర (బాలికల టీమ్ కెప్టెన్), బాలుర విభాగంలో 53కిలోల కేటగిరిలో సీహెచ్ సత్యగోపాల్, 74కిలోల కేటగిరిలో జి.దినేష్‌ప్రసాద్ (బాలుర టీమ్ కెప్టెన్), 83కిలోల కేటగిరిలో ఎన్.దుర్గారామగణేష్, 93కిలోల కేటగిరిలో యశ్వంత్ సుజిత్‌కుమార్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈసందర్భంగా క్రీడాకారులను అభినందించి సత్కరించారు. మట్టపర్తి వెంకటసముద్రం, ఎం.ప్రతాప్, వై.పల్లంరాజు, ఎం.లోవరాజు, డి.కృష్ణ, ఎన్.ఏసు, మాదే వీరేంద్ర, ఫిట్‌నెస్ జిమ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల్లో ద్వితీయ బహుమతి

రాజోలు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో జనవిజ్ఞాన వేదిక, యూటీఎఫ్ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో చింతలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారని హెచ్ఎం డి.జానకీరావు తెలిపారు. పదో తరగతి విద్యార్థి కేఎల్ఎస్ అమృత, 9వ తరగతి విద్యార్థి జి.విజయసతీష్‌కుమార్, 8వ తరగతి విద్యార్థి సీహెచ్ లోకేశ్‌లు జిల్లాస్థాయిలో ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారన్నారు. విద్యార్థులను పాఠశాలకమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

అంతర్వేది ఆలయంలో ఎంపీ పూజలు

అంతర్వేది, నవంబరు23(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి రాజ్యసభసభ్యుడు పాక సత్యనారాయణం ఆదివారం విచ్చేశారు. ఆయనకు అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు.అంతరాలయంలో స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం వారికి అందజేశారు.

యానాం చేరుకున్న పుదుచ్చేరి కలెక్టర్

యానాం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి కలెక్టర్ కులోంత్తగన్ రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం రాత్రి యానాం చేరుకున్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం వద్ద కలెక్టర్‌కు యానాం అధికారులు ఘన స్వాగతం పలికారు. ఓఎన్జీసీ పైప్‌లైన్ లీకేజీ ఘటనపై కాకినాడ జిల్లా కలెక్టర్, ఓఎన్జీసీ అధికారులతో ఆయన చర్చిస్తారు. యానాంలో పలు శాఖల పనితీరు, అభివృద్ధి పనులపై ఆయన సమీక్షిస్తారు.

ఘనంగా రాఘవేశ్వరస్వామి కల్యాణం

అంబాజీపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ముక్కామలలో ఉన్న శ్రీబాలా త్రిపుర సుందరీ రాఘవేశ్వరస్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వెలవెలపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వ ర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, స్వామివారి దివ్యకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివార్ని దర్శించుకున్నారు.

టీడీపీ నాయకుడు రాజు మృతి

కాట్రేనికోన, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోనకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు ఈదరపల్లి లక్ష్మీనరసింహరాజు(59) ఆదివారం మృతి చెందారు. ఆయనకు ఒక కుమార్తె, భార్య ఉన్నారు. మృతదేహానికి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ హరీష్‌మాధుర్ నివాళులర్పించారు. దాట్ల సుబ్బరాజు, చెల్లి సురేష్, ఆకాశం శ్రీనివాస్, నాగిడి నాగేశ్వరరావు, వంగ దుర్గబాబు, నడింపల్లి సుబ్బరాజు, వనచర్ల నాగేశ్వరరావు, బందారు ఏసు, మోటుమర్రి సత్యనారాయణమూర్తి సంతాపం వ్యక్తం చేశారు.

కార్మిక నేత గల్లా రాము వర్ధంతి



రంగాపురంలో రాముకు నివాళులర్పిస్తున్న కార్మిక సంఘ నాయకులు

అమలాపురం రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం కోసం జీవితాంతం పాటుపడ్డ కార్మిక నేతగా గల్లా రాము చిరస్మరణీయులని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాము వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం వివిధ గ్రామాల కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కార్మికులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేయించిన ఘనత రాముకు దక్కుతుందని కొనియాడారు. రంగాపురం శ్రీవెంకటేశ్వరా కొబ్బరి ఒలుపు సంఘం కామనగరువు, శ్రీవినాయక కొబ్బరి ఒలుపు కార్మిక సంఘం, రెడ్డిపల్లి శ్రీవిజయలక్ష్మి, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఒలుపు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సంతాప సభ నిర్వహించారు. రాము వర్ధంతిని పురస్కరించి బంద్ పాటించారు. కార్మిక నేత రాము లేనిలోటు స్పష్టంగా కనిపిస్తుందని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్ కల్పించాలి

రాజోలు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీఎస్టీ వర్గాలకు ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల్లో రిజర్వేషన్ కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ముందుకు రావాలని దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ డిమాండ్ చేశారు. రాజోలులో దళిత నాయకులు మట్టా ఏడుకొండలు ఆధ్వర్యంలో దళిత చైతన్యవేదిక నాయకులు ఇంటింటా అంబేడ్కర్ కార్యక్రమం నిర్వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేటు పరమవుతున్న పరిస్థితుల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ప్రైవేటు కార్పొరేట్ సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందన్నారు. మాజీసర్పంచ్ మట్టా కృష్ణకుమారి, వేదిక ఉపాధ్యక్షుడు చిలకపాటి శ్రీధర్, తెన్నేటి నాగేశ్వరరావు, కాకర విశ్వనాథం పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీలో అదరగొట్టాలి: ఎమ్మెల్యే ఆనందరావు



మాక్ అసెంబ్లీకి ఎంపికైన జెస్సికను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అమరావతిలో నిర్వహించనున్న మాక్ అసెంబ్లీలో అందరినీ ఆకట్టుకునేలా అదరగొట్టాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జెస్సికకు సూచించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో నిర్వహించనున్న మాక్ అసెంబ్లీకి అమలాపురం నియోజకవర్గం తరపున ఎంపికైన గొల్లవిల్లి హైస్కూల్ విద్యార్థిని నేతల జెస్సిక ఆదివారం ఎమ్మెల్యేను కలిసి ఆశీర్వాదం కోరారు. ఎమ్మెల్యే ఆనందరావు జెస్సికను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం గోకరకొండ కనకదుర్గ, యాళ్ళ సత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మల్లాడి పరామర్శ



రోగులను పరామర్శిస్తున్న మల్లాడి

యానాం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): యానాంలో పలు కుటుంబాలను ఆదివారం ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరామర్శించారు. స్థానిక పెద్దిరెడ్డి గార్డెన్స్‌లో ఉంటున్న లంక రమేష్ గుండెకు శస్త్ర చికిత్స చేయించుకోవడంతో ఆయనను మల్లాడి పరామర్శించారు. బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న ఐశ్వర్యను, కీళ్లవాతంతో బాధపడుతున్న రోజా తదితర కుటుంబాలను మల్లాడి పరామర్శించారు. అలాగే యూకేవీ నగర్, భీమ్‌నగర్, గోపాల్‌నగర్, ఫ్రాన్స్‌తిప్ప, దోబి బీది, వెంకటనగర్ తదితర గ్రామాల్లో పలువుర్ని పరామర్శించారు.

జనసేన పార్టీ ప్రమాద బీమా అందజేత

ముమ్మిడివరం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగరపంచాయతీ పరిధిలోని క్రాపచింతలపూడికి చెందిన మాదాల వెంకటేశ్వరరావు, మండలంలోని అనాతవరానికి చెందిన కొడమంచిలి సత్యనారాయణ, ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లికి చెందిన వాసంశెట్టి రాఘువులు ఇటీవల ప్రమాదవశాత్తూ మృతిచెందగా వారికి జనసేన పార్టీ ప్రమాద బీమా అందించింది. వారి కుటుంబ సభ్యులకు మంగళగిరిలోని పద్మావతి ఫంక్షన్ హాలులో ఆదివారం జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు రూ.5లక్షల చొప్పున ప్రమాద బీమా చెక్కులను అందజేశారు. మాదాల శ్రీధర్, సవరపు వెంకట్, వలవల శ్రీనివాసరావు, సవరపు ప్రసాద్, రామాయణం రాజు, ఉద్దీస నాగబాబు, గంధం శ్రీను పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి


అల్లవరం నవంబరు 23(ఆంధ్రజ్యోతి): 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కేవీపీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. గోడిలంక అంబేడ్కర్ నగర్ వద్ద జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీదుర్గారావు అధ్యక్షతన కేవీపీఎస్ సమావేశం జరిగింది. రాజ్యాంగ దినోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పోతుల నాగేశ్వరరావు, శెట్టిబత్తుల బాలకృష్ణమూర్తి, కుంచే చంద్రరావు, గోసంగి పల్లయ్య, ప్రవీణ్, దాసరి సత్యనారాయణ, పోతుల కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని అంబేడ్కర్ సామాజిక భవనం ప్రాంగణంలో ఈనెల26న నిర్వహించే రాజ్యాంగ దినోత్సవ సభను విజయవంతం చేయాలని దళిత సంఘాల నాయకులు కోరారు. ఆదివారం పాశర్లపూడిలో రాజ్యాంగ సభకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెల్లి దుర్గాప్రసాద్, బొంతు మణిరాజు, బత్తుల జనార్ధనరావు, నీతిపూడి మహేష్, నూటుకుర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

మామిడికుదురు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మామిడికుదురు ఎస్సీ సామాజిక భవనంలో జరిగిన పోటీల్లో 40మంది విద్యార్థులు పాల్గొన్నారు. భారత రాజ్యాంగంలో బీఆర్ అంబేడ్కర్ పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు త్వరలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కారుపల్లి కల్యాణ్‌బాబు, సాధనాల సత్యనారాయణ, గెడ్డం భాస్కర్, రవి, బత్తుల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయం భక్తులతో కిటకిట



అంతర్వేది, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఆదివారం స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. తొలుత నదీ సముద్ర పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు క్షేత్ర సంరక్షకుడు ఆంజనేయస్వామి, క్షేత్ర పాలకుడు పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం అన్నాచెల్లెలు గట్టు, లైట్‌హౌస్, బీచ్‌ల వద్ద భక్తులు, పర్యాటకులు సందడి చేశారు.

నిత్యాన్నదానానికి రూ.50వేలు విరాళం

మామిడికుదురు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీనీలాద్రి ప్రొడక్షన్ ప్రైవేట్ లిమిటెడ్‌వారు ఆదివారం రూ.50వేలు విరాళంగా అందించారు. ప్రైవేట్ లిమిటెడ్ యజమాని కె.కృష్ణకు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త మొల్లేటి లక్ష్మీనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా లంకపాలేనికి చెందిన సూర్యనారాయణమూర్తి-నాగవెంకటగణేశ్వరిధనలక్ష్మి దంపతులు రూ.10వేలు విరాళంగా అందించారు. దాతలకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



మండపేటలోని సత్యసాయి మందిరంలో జరిగిన జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల

మానవ సేవే...మాధవ సేవ

• సత్యసాయి శత జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే వేగుళ్ల • వాడవాడలా హోరెత్తిన కార్యక్రమాలు • అధికారులు, భక్తుల ప్రత్యేక పూజలు

మండపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మానవసేవే మాధవసేవగా భావించిన మహనీయుడు పుట్టపర్తి సాయిబాబా అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలోని వల్లూరివీధిలో ఆలమూరు మాజీ ఎమ్మెల్యే వీవీఎస్ఎస్ చౌదరి నిర్మించిన సత్యసాయి మందిరంలో ఆదివారం శతజయంతి వేడుకలను నిర్వహించారు. మండపేటకు సత్యసాయికి ఉన్న అనుబంధాన్ని మాజీ ఎమ్మెల్యే వీవీఎస్ఎస్ సతీమణి సత్యవతమ్మ అప్పటి సంగతులను గుర్తుకు తెచ్చారు. 1967లో సీతారత్నం ఇంట కొద్దిరోజులపాటు సత్యసాయికి చేసిన సేవలను ప్రస్తావించారు. సత్యసాయిపై ఉన్న భక్తితో వల్లూరి వీధిలో నిర్మించిన ఆలయంలో నేటికీ నిత్య పూజలు జరుగుతున్నాయి.

పుట్టపర్తి తరహాలో: మండపేటలో ఆదివారం సత్యసాయి శతజయంతి సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల ప్రసంగించారు. మండలానికి చెందిన మండలస్థాయి అధికారులతో పాటు ఎంఆర్వో పి.తేజేశ్వర రావు, ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి, డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీనువాస్ తదితరులు ఎమ్మెల్యేతో కలిసి కేక్‌కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావు మాట్లాడుతూ సత్యసాయి సేవలు వేలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో సత్యసాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఆదివారం ఆలమూరులో నిర్వహించారు. ఆలమూరులోని కంచర్ల కామేశ్వరరావు ఇంటి వద్ద సత్యసాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన సాయి భక్తులు భజనలు, భక్తిగీతాలు ఆలపించారు. సత్యసాయి చిత్రపటానికి ఎంపీడీవో ఎ.రాజు, తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబుతోపాటు పలువురు అధికారులు, సాయి భక్తులు కంచర్ల కామేశ్వర రావు, కంచర్ల మల్లిక రమేష్‌తోపాటు పలువురు భక్తులు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, తహశీల్దార్‌లతోపాటు పలువురు అధికారులు సత్యసాయి చిత్రపటానికి నివాళులర్పించారు.

రావులపాలెం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సత్యసాయి మందిరంలో సత్యసాయి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, జడ్పీటీసీ కె.శ్రీనివాసరావు, ఎంపీడీవో సీహెచ్ సుబ్రహ్మణ్యం, ఏవో మంగతాయారు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయి శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆత్రేయపురం సత్యసాయి, పేపకాయల సూర్యారావు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలోని సత్యసాయి మందిరంలో ఎంపీడీవో వెంకటరామన్ పాల్గొని మాట్లాడారు. అనంతరం సత్యసాయి కమిటీ సభ్యులు సమకూర్చిన దుప్పట్లను పంపిణీ చేశారు. వందలాది మందికి అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో సత్యసాయి ట్రస్టు ప్రతినిధులు పేపకాయల రామారావు, సాయిబాబా, సాయి శివ, మురళి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవలు అపూర్వం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మాధవ సేవయే మానవ సేవగా భావించి మానవాళికి సత్యసాయి అపూర్వ సేవలు అందించారని సత్యం వాశంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. ఆదివారం సత్యసాయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక బ్రాడీపేటలో సత్యసాయి సేవా సమితి శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ సత్యసాయి సేవలు, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం సత్యసాయి సేవా సమితి సమకూర్చిన దుప్పట్లను పేదలకు సత్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మృత్యుంజయరావు, ఎస్ఐ సత్యప్రసాద్, వీఆర్వోల సంఘం అధ్యక్షులు మద్దాల బాపూజీ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, కంచుమర్తి బాబూరావు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

కొత్తపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయి శతజయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. దీనికి తహశీల్దారు వై.రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం ఏవో మేడపాటి రెడ్డి, ఆర్ఐ రవిశంకర్, రిటైర్డ్ ఎంఈవో వై.సత్తిరాజు, సర్వేయర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాయవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాయవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సత్యసాయి శత జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు మాట్లాడుతూ సత్యసాయి దేశ, విదేశాల్లో అనేక మందిని సేవా మార్గంలో నడిపించారని కొనియాడారు. తొలుత సత్యసాయి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు దేవిశెట్టి కోటేశ్వరరావు, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వల్లూరు గ్రామంలోనున్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం సత్యసాయి శత జయంతి వేడుకలను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వీటిని నిర్వహించినట్లు స్థానిక తహసీల్దార్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సత్యసాయి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు వల్లూరి వీరబాబు, ఆర్ఐ బి.అర్జమ్మ, డిప్యూటీ ఎంపీడీవో బి.వరప్రసాద్, వీఆర్వో అబ్దుల్ కరీం, కార్యదర్శి కె.సత్తిబాబు, రెవెన్యూ సహాయకులు, పంచాయతీ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయి శత జయంతి వేడుకలను మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సచివాలయాల్లో సత్యసాయి చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులర్పించారు. దంగేరు, పామర్రు గ్రామాల్లో సత్యసాయి భక్తులు తెల్లవారుజామున నగర సంకీర్తనలు చేశారు. అనంతరం ఆయనకు పూజలు, భజనలతో పాటు గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు.



ఆలమూరులో సత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొన్న అధికారులు, భక్తులు



రామచంద్రపురంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న సత్యం, తహసీల్దార్ మృత్యుంజయరావు తదితరులు



కె.గంగవరం మండలం పామర్రులో గ్రామోత్సవం నిర్వహిస్తున్న సత్యసాయి భక్తులు



కపిలేశ్వరపురం మండలం వల్లూరులో సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొన్న తహసీల్దార్ శ్రీనివాస్



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. వేకువజామునే స్వామివారికి ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వసంత మండపంలో స్వామివారి దివ్య కల్యాణాన్ని వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య ఘనంగా జరిపారు. అశేష భక్తజనం స్వామివారిని దర్శించుకుని స్వామివారి ప్రసాదంలో పాల్గొన్నారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు వీటి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదే విధంగా ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణ మూర్తి తగిన ఏర్పాట్లు చేశారు.

నవజనార్దన ఆలయాల్లో తెలంగాణ భక్తుల పూజలు



ఆలమూరులోని జనార్దనస్వామి దర్శనానికి తరలివచ్చిన తెలంగాణ భక్తులు

ఆలమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గోదావరి తీరంలో ఉన్న నవజనార్దనస్వామి ఆలయాల దర్శనానికి ఆదివారం తెలంగాణ నుంచి భక్తులు ప్రత్యేక వాహనాలలో తరలివచ్చారు. మండలంలోని ఆలమూరు, జొన్నాడ, మడికిలలోని నవజనార్దనస్వామి ఆలయాలకు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలమూరు విచ్చేసిన భక్తులకు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ బైరిశెట్టి రాంబాబు స్వాగతం పలికారు. ఇక్కడ నుంచి కపిలేశ్వరపురం, మాచర, కోరుమిల్లి, కోటిపల్లి, మండపేట, ధవళేశ్వరం ఆలయాలకు వెళ్లనున్నట్టు వారు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

కపిలేశ్వరపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంగరలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో ఎం. శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా కె.సత్యనారాయణమూర్తి కుమారులు సుబ్రహ్మణ్యం, వెంకట్రావు అర్చక పర్యవేక్షణలో మల్లేశ్వరశర్మ బ్రహ్మత్వంలో ఈనెల 30 వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మంగళవారం నాడు సంకల్పం, అనంతరం గ్రామోత్సవం, రాత్రి స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. 26న స్వామివారి తీర్థం, కొమరిపాలెం వారిచే బాణసంచా కాల్పులు ఉంటాయన్నారు. అదే విధంగా 27న సదస్యం, మ్యాజిక్ షో, 28న భజన మండలిచే కోలాటం, 29న కంకణ సేవా ఉత్సవం, హనుమాన్ చాలీసా, గీతా పారాయణ ఉంటుందన్నారు. ఈనెల 30న స్వామివారి పుష్పోత్సవంతో ఆయా కార్యక్రమాలు ముగియనున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.



అంగరలోనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

చిరస్మరణీయుడు లక్ష్మణస్వామి



లక్ష్మణస్వామి సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

మండపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తొలితరం సీపీఐ సీనియర్ నేత బండారు లక్ష్మణస్వామి మృతి పార్టీతోపాటు పేదవర్గాలకు తీరని లోటని వక్తలన్నారు. ఏడిదలో ఆదివారం ఆయన సంతాప సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి, సంస్మరణ సభకు ఏఐటీయుసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు అధ్యక్షత వహించారు. తొలుత బండారు చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ బండారు ఆయన ఆశయ సాధన కోసం పోరాడాలన్నారు. సభలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, సహకార సంఘ అధ్యక్షుడు ఎర్రబ్బు, డాక్టర్ చెలికాని స్టాలిన్, సీపీఐ నాయకులు కె.రామకృష్ణ, వి.శామ్యూల్, రవికుమార్, రాము, లక్ష్మణస్వామి, దూళి జయరాజు, ఆనుకులు సుబ్బారావు, కట్టా సత్యనారాయణ, కుంద్రపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో డాక్టర్ బాలపరమేశ్వర రావును సత్కరిస్తున్న దృశ్యం

నరాల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ఆలమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నరాలు, మెదడు, వెన్నుముకకు సంబంధించిన సమస్యలతో పాటు వాధ్యుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా వైద్యులను సంప్రదించాలని న్యూరో వైద్య నిపుణుడు డాక్టర్ ఎస్‌జె బాలపరమేశ్వరరావు సూచించారు. రాజమహేంద్రవరం సిటీ న్యూరో కేర్, డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రుల అధ్వర్యంలో ఆలమూరు మండలం కొత్తూరులో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో న్యూరో సమస్యలతో వచ్చిన వారికి బాలపరమేశ్వరరావు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో పలువురికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. సకాలంలో న్యూరో సమస్యలను గుర్తించి వైద్యుల సలహా మేరకు వెళ్లాలని అవగాహన సదసులో డాక్టర్ బాలపరమేశ్వరరావు అన్నారు. స్థానికుల అధ్వర్యంలో ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.రాజు, నాయకులు ఈదల సత్తిబాబు, వంటిపల్లి పాపారావు, సలాది నాగేశ్వరరావు, ఈదల నల్లబాబు, సిద్ధిరెడ్డి పెదకాపు, ఎలుగుబంటు సాయిబాబు, నడిపల్లి వెంకటేశ్వరరావు, ఎస్.వెంకటేష్, బావన శ్రీనివాస్, వైట్ల శేషబాబు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు

రాయవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాయవరం-రాజానగరం ప్రధాన రహదారిలో ఆదివారం గుంతలను పూడ్చారు. రాయవరం శివారు కల్యాణ మండపం వద్ద నుంచి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ఉన్న గుంతలను పూడ్చారు. ఆర్‌అండ్‌బీ డీఈఈ టీవీఎస్ సూర్యనారాయణ మాట్లాడుతూ రూ. 12 లక్షలతో మండపేట-ఏడిద, పసలపూడి-మాచవరం రోడ్డు, ద్వారపూడి-మండపేట, రాయవరం-లొల్ల గ్రామాల మధ్యలో ఉన్న గుంతలను పూడ్చనున్నట్లు ఆయన తెలిపారు.

కాటన్‌ను స్మరించుకోవడం అందరి బాధ్యత

ఆలమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన మహనీయుడు సర్‌ఆర్థర్ కాటన్‌దొరను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని బాధ్యత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు గిరిజాల బాబు అన్నారు. ఆలమూరు మండలం సందిపూడిలో రైతు కుటుంబానికి చెందిన దొడ్డా సత్తిపండు సొంత ఖర్చుతో కాటన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాటన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా బాధ్యత సంస్థ తరపున ఆదివారం ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో బాధ్యత సంస్థ సభ్యుడు సి.శ్రీనివాస్, నాయకులు తోట వెంకటేశ్వర్లు, అంగర కొండ, దొడ్డా పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో చిన్నారుల భవిష్యత్‌లను తీర్చిదిద్ది ఉత్తమ పౌరులుగా చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండల శాఖ ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం అధ్వర్యంలో నిర్మించిన నూతన భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని అన్నారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఎం.రాజగోపాల్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.రాజు, తహశీల్దార్ ప్రకాష్‌బాబు, ఎస్టీయు మండల శాఖ అధ్యక్షుడు సలాది శ్రీనివాస్, నాయకులు ఈదల సత్తిబాబు, వంటిపల్లి పాపారావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీయూ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం

రావులపాలెం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రావులపాడులో రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారి ఎస్.అరుణకుమార్ ఆధ్వర్యంలో 2వ రోజు ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా స్వచ్ఛభారత్ శ్రమదానం నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం కాలువలు, నదులను వ్యర్థాలతో కలుషితం చేయకుండా ఉంచుదాం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రధాన పంటకాలువలో జలహారతి నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టా సత్యదేవి, మిషన్ గ్రీన్ ప్లాంట్ వ్యవస్థాపకులు ఎస్.కిషోర్, వలంటీర్లు పాల్గొన్నారు.



రావులపాడులో శ్రమదానం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

చెకుముకి సైన్సు సంబరాలు

రావులపాలెం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జడ్పీ బాలికల పాఠశాలలో చెకుముకి సైన్సు సంబరాలు నిర్వహించారు. దీనికి ప్రభుత్వ పాఠశాలల నుంచి 26, ప్రైవేట్ పాఠశాలల నుంచి 22 మొత్తం 48 బృందాలు పోటీ పడ్డాయి. వీటిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన టీమ్‌లు రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలకు అర్హత సాధించినట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు జనపల్లి సత్యనారాయణ తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాలల అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, పాఠశాల చైర్మన్ నందం వీరవెంకట సత్యనారాయణ, జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జ్ఞానేశ్వరి, డాక్టర్ సీహెచ్ రవికుమార్, జ్యోతి బసు, సోమేశ్వరరావు, అబ్బులు, లింగేశ్వర రెడ్డితో పాటు ఇతర పాఠశాలల హెచ్‌ఎంలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఏపీఎన్జీవో భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

కొత్తపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న ఏపీఎన్జీవో పాత భవనం స్థానంలో నూతన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని నూతన కార్యవర్గం ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కలిసి చర్చించారు. కొత్తపేట తాలుకా ఏపీఎన్జీవో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యేను వారు సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవో కొత్తపేట తాలుకా అధ్యక్షులు యేపుగంటి సురేష్, ఎం.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కె.గంగవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి సత్యం ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం రూ.20 వేలు ఆర్థికసాయం చేశారు. పాతకోట గ్రామంలో శనివారం గంగుమళ్ల ధర్మయ్యకు చెందిన తాటాకిల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. ఇది తెలుసుకున్న మంత్రి సుభాష్ అదేశాలతో ఆదివారం కోట గ్రామంలో ధర్మయ్య కుటుంబాన్ని వాసంశెట్టి సత్యం పరామర్శించారు. ఆర్థిక సాయంతోపాటు నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు ములకల విశ్వేశ్వరరావు, కూటమి నాయకులు ములకల రామచంద్రరావు, తాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ ఫెడరేషన్ చైర్మన్‌గా రామారావు

రావులపాలెం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండల పరిషత్ మీటింగ్ హాలులో జిల్లా వెటర్నరీ ఫెడరేషన్ చైర్మన్‌గా మోటూరి రామారావు ఎంపికయ్యారు. తూర్పుగోదావరి జిల్లా జూనియర్ వెటర్నరీ ఆఫీసర్స్, వెటర్నరీ లైవ స్టాక్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర చైర్మన్ బి.సేవానాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొని ఖాళీగా ఉన్న ఉమ్మడి తూర్పుగోదావరి ఫెడరేషన్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా మోటూరి రామారావు, ట్రెజరర్‌గా జీవీవీ సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా వి.సూర్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.రామకృష్ణ, ఈసీ మెంబర్‌గా ఎం.అక్కినాయుడులను ఎన్నుకున్నారు.

వాడపల్లి వెంకన్న భక్తులకు 108 అంబులెన్స్ సేవలు

ఆత్రేయపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 108 సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ఆధ్వర్యంలో 108 అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రతి శనివారం పీహెచ్‌సీ సిబ్బందితో వైద్య శిబిరం నిర్వహించి దేవస్థానం భక్తులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరింత మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఏదైన ఘటన జరిగితే మరింత వైద్యం అందించేందుకు 108 సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ అంబులెన్స్‌లో ఈసీజీ, వెంటిలేటర్, ఆక్సిజన్, బీపీ, షుగర్, గుండెకు సంబంధించిన వైద్య సేవలతో పాటు టెక్నీషియన్‌ను అందుబాటులో ఉంచారు. ఆపద సంభవిస్తే అంబులెన్స్ ద్వారా మెరుగైన వైద్యం సమయంలో ప్రత్యేక వైద్య నిపుణులు ఫోనులో సేవలు అందిస్తారు. దేవస్థానం వద్ద 24 గంటలు అందుబాటులో ఉండేలా దీన్ని ఉంచారు. అంబులెన్స్ కావాలని కోరిన వెంటనే ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సకాలంలో దేవస్థానానికి సమకూర్చినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషి మేరకు భక్తులకు దీని ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.



చెల్లూరులో ఎన్టీఆర్ విగ్రహ పునర్నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

ఎన్టీఆర్ విగ్రహ పునర్నిర్మాణానికి భూమిపూజ

రాయవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహ పునర్నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. టీడీపీ సీనియర్ నేత మాజీ సర్పంచ్ నూనె ఏసుబాబు చేతుల మీదుగా భూమిపూజ చేశారు. ఈసందర్భంగా టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుంద్రు వీర్రాజు మాట్లాడుతూ రూ.6 లక్షలతో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు భూమిపూజ నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత కోట రామారావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెబాట

మండపేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని మండల కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు ఎస్.సర్వేశ్వరరావు, కృష్ణమాధురి, మధు, శేషారావు అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద దీక్షలు, డిసెంబరు 10న చలో విజయవాడ సభ నిర్వహిస్తున్నామని వారన్నారు. తమ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని మండల విద్యాధికారి ఎన్.రామచంద్రరావుకు ఉద్యోగ సంఘ ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో సర్వేశ్వరరావు, మాధురి, మధు, శేషారావు తదితరులు ఉన్నారు.